క్లుప్తంగా

విధుల్లో చేరిన జేపీఎస్‌లు

మహబూబాబాద్ రూరల్: సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె చేస్తున్న మహబూబాబాద్ మండలంలోని 30మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శుల్లో 29 మంది విధుల్లో చేరారని ఎంపీడీఓ కె.వెంకటేశ్వర్లు శనివారం రాత్రి తెలిపారు. మిగిలిన ఒకరు సెలవుల్లో ఉన్నారని తెలిపారు.
డోర్నకల్: మండలంలో సమ్మె చేస్తున్న 18మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శనివారం విధుల్లో చేరారు.

నేడు హనుమాన్ జయంతి

ముస్తాబైన ఆలయాలు

మహబూబాబాద్ రూరల్: వీర హనుమాన్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీరామ ఆలయం, శ్రీవేణుగోపాల స్వామి దేవాలయం, హనుమంతుని గడ్డ హనుమంతుని గుడి, అంజన్న దేవాలయాలు శనివారం ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాల అర్చకులు కృష్ణప్రసాద్, లక్ష్మీనారాయణ చార్యులు, సందీప్ శాస్త్రి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30గంటలకు ఆంజనేయ స్వామివారికి గర్భగుడిలో పంచామృత అభిషేకం, 7గంటల నుంచి ఉత్సవమూర్తికి దేవాలయం బయట అభిషేకము నిర్వహిస్తారని తెలిపారు. 8.30 గంటలకు ఆంజనేయ స్వామి వారి హోం కార్యక్రమం ఉంటుందని, మధ్యాహ్నం మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామంలోని ముక్కంటి ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మహాఅన్నదాన కార్యక్రమం ఉంటుందని భక్తులు, గ్రామస్తులు పాల్గొనాలని ఆలయ నిర్మాణకర్త నామిరెడ్డి సంయుక్త ఫ్యామిలీ ట్రస్ట్ చైర్మన్ నామిరెడ్డి సీతారాంరెడ్డి హమేంద్రాదేవి దంపతులు తెలిపారు.

పుస్తకావిష్కరణ



మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ రవీంద్రభారతిలో జిల్లా కేంద్రానికి చెందిన రచయిత డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ రాసిన స్వయం సిద్ధ అనే పుస్తకాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ సలహాదారులు మృణిని, ప్రముఖ రచయిత బండారు విజయ, పీఓడబ్ల్యూ మహిళ జాతీయ కన్వీనర్ సంధ్య శనివారం ఆవిష్కరించారు.

ఎమ్మెల్యే పూజలు



బయ్యారం: మండలంలోని సంగ్యాతండాలో నూతనంగా ప్రతిష్టిస్తున్న బొడ్రాయి, ఆంజనేయస్వామి విగ్రహాలకు ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియ శనివారం పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా బంజారా మహిళలతో కలిసి నృత్యం చేశారు. అనంతరం ఉప్పలపాడు పంచాయతీలోని జనార్దనపురంలో ఇటీవల పిడుగుపాటుతో మృతి చెందిన వెంకన్న కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గణేష్, సొసైటీ ఉపాధ్యక్షులు సత్యనారాయణ, నాయకులు లక్ష్మణ్‌నాయక్, వెంకన్న, వీరన్న, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

మహబూబాబాద్ రూరల్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. డీసీసీ కార్యాలయం ఎదుట, మదర్ థెరిస్సా సెంటర్, నెహ్రూసెంటర్ ప్రాంతాల్లో బ్యాండ్ వాయిద్యాలతో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ వైస్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు మేకల వీరన్న, మహిళా జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పోతురాజు రాజు, ఎస్టీ సెల్ రాష్ట్ర, జిల్లా నాయకులు వెంకట్ నాయక్, బానోత్ ప్రసాద్, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణాలో పునరావృతం..

డోర్నకల్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తెలంగాణా రాష్ట్రంలో పునరావృతమవుతాయని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు మాళోత్ నెహ్రూనాయక్ తెలిపారు. స్థానిక గాంధీ సెంటర్‌లో శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూక్యా తారాచంద్, శీలం శ్రీనివాస్, ఎల్లావుల హరికృష్ణ, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: గార్లలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణ గౌడ్, ఎంపీటీసీ ఎం వెంకట్‌లాల్, శంషాద్‌బేగం, రామారావు, నర్సయ్య, రాము, నానిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని హర్షిస్తూ శనివారం డివిజన్ కేంద్రంలో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సధాకర్, రాంరెడ్డి, శ్రీనివాస్, సోమరాజశేఖర్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసముద్రం/నెల్లికుదురు/గూడూరు/దంతాలపల్లి/పెద్దవంగర: కర్ణాటక రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంపై శనివారం కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి,కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట వెంకన్న, ధన్నసరి సొసైటీ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎండి.యాకూపాష, ఉప సర్పంచ్ శివరాత్రి సంపత్, నాయకులు బుడిగె సతీష్‌గౌడ్, చంటి స్వామి, అయూబ్‌ఖాన్, సత్యానందం, బానోత్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: సంబురాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



గూడూరు: సంబురాలు జరుపుకుంటున్న నాయకులు



డోర్నకల్: నెహ్రూనాయక్‌కు స్వీట్లు తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకులు



తొర్రూరులో..

నిరుపయోగంగా మరుగుదొడ్లు



డోర్నకల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మరుగుదొడ్లు నిర్మించారు. మరుగుదొడ్లకు నీటి వసతి కోసం పైపులైన్ ఏర్పాటు చేసినా నీటి వసతి కల్పించలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. వివిధ గ్రామాలను కార్యాలయానికి వచ్చి అధికారుల కోసం ఎదురు చూసే ప్రజలు మరుగుదొడ్ల వసతి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రమాదకరంగా గుంత



గార్ల: గార్ల రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చాలని రైల్వే ప్రయాణికులు సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. గార్ల రైల్వేస్టేషన్‌కు నిత్యం ప్రయాణికులు, వాహనాలు నడిచే రహదారికి మధ్యలో గుంతలు ఏర్పడి 2 నెలలు కావస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు.

సుఖప్రసవాలకు కేరాఫ్..

- మరిపెడ పీహెచ్‌సీలో జిల్లాలోనే అధికంగా సుఖప్రసవాల నమోదు
- నిత్యం అందుబాటులో వైద్యాధికారి

మరిపెడ: సుఖప్రసవాలకు మరిపెడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం కేరాఫ్‌గా మారింది. సుఖప్రసవాల సంఖ్య జిల్లాలోనే అధికంగా నమోదు కావడం విశేషం. అంతేకాదు రెండు రోజుల్లోనే ఏడు సుఖప్రసవాలు చేయడం, శనివారం 24గంటల్లో నాలుగు ప్రసవాలు చేసి డాక్టర్ గుగులోతు రవికుమార్ ఈ ప్రాంత ప్రజల మన్ననలు పొందుతున్నారు.

మరిపెడ పాత తాలూక కేంద్రంగా ఉన్న 1962లో ఇక్కడ ఆరోగ్య కేంద్రం నిర్మించారు. పదిపడకల ఆస్పత్రిగా 24గంటలు రోగులకు సేవలందిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం కేసీఆర్ కిట్ అందజేస్తున్నారు. అంతే కాకుండా ఇక్కడి డాక్టర్ రవికుమార్ స్థానికుడు కావడం నిత్యం అందుబాటులో ఉండడంతో ఆయనపై ఉన్న నమ్మకంతో ప్రసవాల సంఖ్య పెరుగుతున్నాయి. ఆయన ప్రతిభకు గుర్తించి ఉత్తమ వైద్యాధికారిగా ప్రశంసాపత్రం అందజేశారు. ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలకు కావల్సిన అన్నిసౌకర్యాలు ఉన్నాయి. ప్రజలు గుర్తించడం వల్లే ప్రసవాల సంఖ్య పెరుగుతుంది. ప్రసవం కోసం వచ్చిన వారికి ఇబ్బంది కలిగితే ప్రభుత్వ వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలిస్తారు. ప్రత్యేక ఆపరేషన్ ఏసీ గదితోపాటు ఆక్సిజన్ లాంటి సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయి. ప్రజలు వినియోగించుకోవాలి. 24గంటలు ఆస్పత్రి తెరిచే ఉంటుంది.



బాలింతకు కేసీఆర్ కిట్ అందజేస్తున్న డాక్టర్ రవికుమార్

ఉపాధి పథకాన్ని రద్దు చేసేందుకు కుట్ర



కేసముద్రం: ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

కేసముద్రం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పథకాన్ని రద్దు చేసేందుకు కుట్రతో పనిచేస్తున్నాయని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా ఉమ్మడి వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి ఆరోపించారు. శనివారం మండలంలోని మహముద్‌పట్నం గ్రామంలో కూలీలు చేస్తున్న ఉపాధి హమీ పనులను పార్టీ నాయకులు సందర్శించి, సర్వే నిర్వహించారు. ఈనెల 15న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీల సమస్యలపై చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి కందాల రంగయ్య, జానీ, కొమురయ్య, భవాని, స్వరూప, నాగమణి, అశోక్, స్వామి, ప్రభాకర్ పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజంపెల్లి వీరన్న కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పనిదినాలు పెంచాలి

గార్ల: ఉపాధిహామీ పథకంలో పనిదినాలు 200రోజులకు పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలం లోని ముత్తితండా, గార్లలో జరుగుతున్న ఉపాధి పనుల ప్రదేశాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. కూలీలు పనులు చేసి 15రోజులు కావస్తున్నా, డబ్బులు చెల్లించడం లేదన్నారు. కార్యక్రమంలో వ్యకాసం మండల కార్యదర్శి పెద్దవెంకటేశ్వర్లు, హరినాయక్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లికుదురు: ఉపాధి కూలీల రోజువారి వేతనం రూ.600కు పెంచి ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు అందించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మూడు మండలాల కార్యదర్శి ఇరుగు అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో ఉపాధి కూలీతో మాట్లాడారు. కార్యక్రమంలో యాకలక్ష్మి, మంగమ్మ పాల్గొన్నారు.

బయ్యారం: ఈనెల 15న చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని న్యూడెమోక్రసీ ప్రజాపంథా సంయుక్త మండల కార్యదర్శి బిల్ల కంటి సూర్యం పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం మండలంలోని కొత్తపేట, గంధంపల్లి ప్రాంతాల్లోని పని ప్రదేశాల్లో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. ఉమ్మగాని సత్యం, కొలిపాక రవి పాల్గొన్నారు.

న్యాక్ గుర్తింపు వచ్చేలా కృషి

తొర్రూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామని ప్రిన్సిపాల్ బానోతు రెడ్డి తెలిపారు. న్యాక్ బృందం ఈనెల 15, 16 తేదీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించనున్న నేపథ్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని కళాశాలలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, అధ్యాపకులు రోహిణి, రమేష్, సునీత, అంజు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ

పెద్దవంగర: మండలంలోని రెడ్డికుంట తండాలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను సర్పంచ్ జగ్గు నాయక్‌తో కలిసి ఎంపీటీసీ బానోత్ రవీందర్‌నాయక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు జాటోతు నెహ్రూ నాయక్ పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' పథకం వర్తింపజేయాలి

నెహ్రూసెంటర్: పేదల ఇంటి నిర్మాణానికి గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్ అన్నారు. ఇంటింటికీ సీపీఐ కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పలువార్డుల్లో ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, సాంబలక్ష్మీ, రవి, శ్రావణ్ పాల్గొన్నారు.

చీరల పంపిణీ

కేసముద్రం: మండలంలోని ధన్నసరి గ్రామంలో శనివారం సువర్ణలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా సర్పంచ్ కొండ్రెడ్డి శ్రీవాణి, ధన్నసరి సొసైటీ డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 20 మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకన్న, వెంకటమల్లు, సూరయ్య, రవిందర్, శ్రీనివాస్, సుమన్, కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణంలో జాప్యం

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో మనఊరు-మనబడి పథకం కింద రూ. 41లక్షలు మంజూరైయింది. ఈపథకంలో పాఠశాలకు భోజన శాల గది, పాఠశాల మరుగుదొడ్ల మరమ్మతులు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యాలు పాఠశాల ప్రహరీ నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. గతంలో వర్షాలకు పాఠశాల ప్రహరీ కూలిపోయింది. ఈక్రమంలో పాఠశాల ప్రహరీ నిర్మాణం విషయంలో పాఠశాల పక్క స్థలం వారితో వివాదం జరుగుతున్న క్రమంలో నిర్మాణం జరగడం లేదు. ఈ విషయంలో మున్సిపల్ చైర్మన్, కమిషనర్ అధికారులు వచ్చి సమస్యను పరిష్కరిచండంలో విఫలమయ్యారు. పాఠశాల ప్రహరీ నిర్మాణం జరగడంలో జాప్యం జరగడంతోపాటు మన ఊరు-మన బడి పనులు జరగడంలో నిర్లక్ష్యంగా సదరు కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్నారని, సమస్యను పరిష్కరించాలని పాఠశాల ఉపాధ్యాయులు కోరుతున్నారు. పాఠశాలకు భవనానికి మ్యాప్ ఉంది. కాని పాఠశాల స్థలానికి మ్యాప్ లేదని పాఠశాల హెచ్‌ఎం తెలుపుతున్నారు.



ప్రహరీ లేని ప్రభుత్వం పాఠశాల

సీఎం కప్‌లో చురుగ్గా పాల్గొనాలి

తొర్రూరు: సీఎం కప్‌లో భాగంగా నిర్వహించే క్రీడా పోటీల్లో స్థానికులు చురుగ్గా పాల్గొనాలని ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్యలు కోరారు. సీఎం కప్ నిర్వహణపై శనివారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఎంపీపీ, చైర్మన్‌లు మాట్లాడారు. ఈనెల 15, 16, 17 తేదీల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, ఖోఖో క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుమార్, ఎస్సై సతీష్, వైస్ ఎంపీపీ ఇట్టె శ్యామ్ సుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఎంపీఓ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ అంజయ్య

నర్సులకు యూనిఫాం అందజేత

కేసముద్రం: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలో సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేసముద్రం, ఇనుగుర్తి పీహెచ్‌సీ నర్సులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ వ్యవస్థాపకులు చిలువేరు సమ్మయ్యగౌడ్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ దామరకొండ ప్రవీణ్‌కుమార్, బీసీ సంఘం జిల్లా కార్యదర్శి గుణగంటి అశోక్, రాహుల్, మధు, రాము, రాజు, వెంకన్న, నర్సయ్య, రాజా, ప్రశాంత్, వెంకట్, అశోక్, వెంకటేశ్వర్లు, వైద్యులు సంధ్య, మౌనిక, ఎఎన్‌ఎంలు కవిత, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేసిన యూనిఫాంలతో నర్సులు

సంక్షిప్త సమాచారం

విరాళం అందజేత

గూడూరు: మండలంలోని పొనుగోడు గ్రామంలో నిర్వహించనున్న దుర్గమ్మ, పోచమ్మ తల్లి ఉత్సవాలకు సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్ తన వంతు సహకారంగా రూ.10,116 అందించారు.

మంత్రి పరామర్శ..



కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) శివారు బంగారుగూడెం సర్పంచ్ భూక్య జీవన్ తండ్రి భూక్య బీక్యానాయక్ మృతి చెందాడు. ఈమేరకు శనివారం మంత్రి సత్యవతిరాథోడ్ తండాకు వెళ్లి బిచ్యా మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ జీవన్‌ను పరామర్శించి ఓదార్చారు. అలాగే సీరోలు మండలం కాంపల్లి శివారు బీల్యానాయక్ తండాలో బానోత్ అరుణ దశదిన కర్మలకు హాజరయ్యారు. మంత్రి వెంట జెడ్పీటీసీ సభ్యుడు బండి వెంకటరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నరహరి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయానికి బందోబస్తు

డోర్నకల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె, కార్యదర్శి ఆత్మహత్య నేపథ్యంలో శనివారం ఎంపీడీఓ కార్యాలయానికి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా ఇప్పటి వరకు నలుగురు పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరగా మరో మహిళా కార్యదర్శి ప్రసూతి సెలవులో ఉన్నారని ఎంపీడీఓ అపర్ణ తెలిపారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె

గూడూరు: సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 27వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా సంఘం అధ్యక్షురాలు శ్రీలత మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేంత వరకు ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో పురుషోత్తం, శ్రీలత, భారతి, లక్ష్మయ్య, కుమార్, రమేష్, శారద, వసంత పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీఓఏలు చేపట్టిన సమ్మె శనివారం 27వ రోజుకు చేరుకుంది. ఈసమ్మెలో వీఓఏలు కృష్ణవేణి, రోజా, శోభా, రాధిక, రమేష్, విజయ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: వీఓఏల సమ్మె శిబిరాన్ని శనివారం మండల కాంగ్రెస్ నాయకుల బృందం కలిసి సమ్మెకు మద్దతు ప్రకటించారు. నాయకులు కృష్ణగౌడ్, వెంకట్‌లాల్, శంషాద్‌బేగం, భిక్షపతి, రాము, రామారావు, నర్సయ్య ఉన్నారు.

స్థూపం ఆవిష్కరణ

నెహ్రూసెంటర్: కార్మికుల పక్షాన పోరాటాలు నిర్వహించిన కార్మికుల పక్షపాతి తోట బిక్షం అని సీపీఎం మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో తోట బిక్షం రెండో వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపాన్ని శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, టీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిట్యాల జనార్దన్, మాజీ కౌన్సిలర్ ఎడ్ల రమేష్, సీపీఎం, నాయకులు గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి



నెహ్రూసెంటర్: రేజర్లపై లైంగిక వేదింపులకు పాల్పడ్డ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ప్రజా సంఘాల నాయకులు జి.సక్రు, ఆలకుంట్ల సాయిలు, ఉమ్మగాని సత్యం, హేమానాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో శనివారం కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్, ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు సత్యనారాయణ, గణేష్, మదు, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి



డ్రైవర్ మురళి మృతదేహం

మరిపెడ రూరల్: అనుమానాస్పదంగా పీడీఎస్ రైస్ లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గిరిపురం క్రాస్ రోడ్డు సమీపంలోని ఆధునిక వ్యవసాయ మార్కెట్ గిడ్డంగి వద్ద 365 జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన డొనకని మురళి (55) పీడీఎస్ బియ్యం సరఫరా చేసే వరంగల్‌కు చెందిన లారీల కాంట్రాక్టర్ నరేష్ వద్ద లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గిరిపురం క్రాస్‌రోడ్డులో ఉన్న ఆధునిక వ్యవసాయ మార్కెట్ గిడ్డంగిలో నుంచి శుక్రవారం రాత్రి పీడీఎస్ బియ్యాన్ని లారీలో లోడ్ చేశారు. ఈ లారీని మరిపెడ మున్సిపాలిటీలోని ఎఫ్‌సీఐ గోడౌన్‌కు తరలించాల్సి ఉంది. కానీ, రాత్రి పొద్దుపోవడంతో గిడ్డంగి వద్దనే తోటి లారీ డ్రైవర్లతో కలిసి మురళి ఉండిపోయాడు. ఇదే లారీతో లోడ్ అయిన మరో రెండు లారీలు వారికి కేటాయించిన ప్రాంతాలకు ఉదయం వెళ్లిపోయాయి. ఈ క్రమంలో మృతుడి కుమారుడు రాత్రి నుంచి తన తండ్రి మురళికి ఫోన్ చేస్తుండగా రింగ్ అవుతున్నా.. ఫోన్ ఎత్తడం లేదు. అనుమానం వచ్చిన కుమారుడు సంఘటనా స్థలానికి చేరుకోగా తండ్రి లారీ క్యాబిన్ కింద విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే 108 వాహనానికి ఫోన్ చేయగా సంఘటనా స్థలానికి వచ్చిన అంబులెన్స్ సిబ్బంది సీపీఆర్ చేసి మురళి మృతి చెందినట్లు నిర్ధారించి వెళ్లిపోయారు.

మృతిపై అనుమానం..

మృతుడు మురళి కాలుకు, చేతికి గాయాలై రక్తపు మరకలు ఉండడంతో బాధిత కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లారీ డ్రైవర్ల మధ్య శుక్రవారం రాత్రి గొడవ జరిగిందని స్థానికులు కొందరు చెప్పినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘర్షణ వాతావరణంలోనే మురళిని హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని మృతిడి భార్య నీలమ్మ వేడుకున్నారు. సంఘట స్థలానికి మరిపెడ పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

దంతాలపల్లి: బూతులు తిట్టి, గొడ్డలితో చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కూచిపూడి జగదీష్ శనివారం తెలిపారు. వివరాలు.. మండలంలోని గున్నెపల్లి గ్రామంలో మద్దిరాల ఉప్పలయ్య అనే వ్యక్తి శుక్రవారం రాత్రి డబుల్ బెడ్రూం ఇళ్లలోకి వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా రాళ్లను పెట్టాడు. విషయం గమనించిన అదే గ్రామానికి చెందిన మద్దిరాల యల్లయ్య రాళ్లను ఎందుకు అలా పెట్టావు దాని వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు, రాళ్లు తీయాలని చెప్పగా. అతడిని బూతులు తిట్టి గొడ్డలితో చంపుతానని బెదిరించాడని మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉప్పలయ్య పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా స్వాధీనం..

దంతాలపల్లి: గుడుంబా స్వాధీనం చేసుకొని వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్ద ముప్పారం గ్రామంలో పోలీసులు సోదాలు నిర్వహించగా గ్రామానికి చెందిన కొండ వెంకన్న ఇంట్లో 8లీటర్ల గుడుంబా పట్టుబడినట్లు తెలిపారు. కొండ వెంకన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపారు. ఏఎస్ఐ చందర్, సిబ్బంది ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మరిపెడ: ఆటోలో దేవుడి దగ్గరికి వెళ్లి వస్తుండగా ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలైన సంఘటన మరిపెడ మున్సిపాలిటీ శివారులో శనివారం తెల్లవారుజామున జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని తానచంర్ల శివారు సపావత్‌తండాకు చెందిన తేజావత్ నీల, గంగరాజు, సిమాన్, సక్కోలిలు ఆటోలు మరిపెడలోని మాకుల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి నిద్ర చేసి శనివారం ఉదయం తిరిగి తండాకు వెళ్తున్న క్రమంలో ఎదురుగా ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న నీలకు తీవ్ర గాయాలయ్యాయి. మిగత ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108సహాయంతో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నల్లబెల్లం పట్టివేత

నెల్లికుదురు: అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లాన్ని పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే మండలంలోని పార్వతమ్మ గూడెం గ్రామ బస్‌స్టాప్ వద్ద శనివారం పోలీసులు వాహనాల తనిఖీలో భాగంగా మహబూబాబాద్ నుంచి నెనెల్లికుదురు వైపునకు వెళ్తున్న ఓ వాహనాన్ని ఆపి తనిఖీ చేస్తుండగా బెల్లం తరలిస్తున్న వారు పారిపోయారు. వాహనంలో ఐదు బస్తాల నల్లబెల్లం, రెండు బస్తాల పటికను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

కొండగట్టుకు హనుమాన్ మాలధారులు



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని హనుమంతునిగడ్డ అంజన్న దేవాలయంలో హనుమాన్ స్వాముల ఇరుముడిధారణ కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. హనుమాన్ దీక్ష స్వీకరించిన స్వాములకు ఆలయ పూజారి దాసరోజు సందీప్ శాస్త్రి ఇరుముడి ధారణ చేశారు. అనంతరం స్వాములు కొండగట్టు అంజన్న సన్నిధికి తరలివెళ్లారు.

కేసముద్రం: మండలంలోని వెంకటగిరి శివారు చంద్రుతండాలో హనుమాన్ మాల ధరించిన స్వాములు శనివారం ఇరుముడితో కొండగట్టుకు బయలుదేరారు. ఉమేష్‌శర్మ, రాజేశ్వరాచార్యులు, స్వాములు పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని బ్రాహ్మణపల్లిలో గురుస్వామి మధుగౌడ్ ఆధ్వర్యంలో ఇరుముడులు కట్టుకొని కొండగట్టు బయలుదేరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మహబూబాబాద్: 9010144453
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్, (S.R) : 7997958185
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646